నమస్తే తెలంగాణ

హనుమకొండ

5 | వరంగల్, శనివారం 23 నవంబర్ 2024 | HANUMAKONDA


## దాస్యం వినయ్‌భాస్కర్‌కు కేసీఆర్ ఆశీర్వాదం



హనుమకొండ, నవంబర్ 22 : ఓరుగల్లు ఉద్యమనేత, బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ తన పుట్టిన రోజు సందర్భంగా శుక్రవారం ఎర్రవెల్లిలో తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. వినయ్‌భాస్కర్‌కు కేసీఆర్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## నిస్వార్థ సేవకు వందనం

- నేరెళ్ల శోభావతికి దక్కిన పురస్కారం
- ఇన్నర్‌వీల్ క్లబ్ ద్వారా అనేక కార్యక్రమాలు
- 24న హైదరాబాద్‌లో అవార్డు ప్రదానం



నేరెళ్ల శోభావతి

పోచమ్మమైదాన్, నవంబర్ 22 : ప్రముఖ మిమిక్రీ కళాకారుడు నేరెళ్ల వేణుమాధవ్ సతీమణి, వరంగల్ ఇన్నర్ వీల్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షురాలు నేరెళ్ల శోభావతిని 'నిస్వార్థ సేవా పురస్కారం' వరించింది. ఈ నెల 24న హైదరాబాద్‌లో ఇంటర్నేషనల్ ఇన్నర్‌వీల్ క్లబ్ ఆర్గనైజేషన్ ప్రతినిధుల చేతులమీదుగా అవార్డు అందుకోనున్నారు. ఎలాంటి పదవి లేకున్నా క్లబ్ ద్వారా నాలుగున్నర దశాబ్దాల నుంచి నిస్వార్థంగా అందిస్తున్న సేవలను గుర్తించి అవార్డుకు ఎంపికయ్యారు. శోభావతికి అవార్డు రావడం పట్ల క్లబ్ అధ్యక్షురాలు ఎన్.లావణ్య, ప్రధాన కార్యదర్శి ఎం రేణుక శుభాకాంక్షలు తెలిపారు.

***1976లో వరంగల్ ఇన్నర్ వీల్ క్లబ్‌కు శ్రీకారం***

పేద మహిళలు, వృద్ధులు, విద్యార్థులకు సేవలందించేందుకు గాను వరంగల్‌లో 1976 సంవత్సరంలో ఇన్నర్ వీల్ క్లబ్‌కు శ్రీకారం చుట్టారు. పది మంది సభ్యులతో మొదలైన క్లబ్ ఇవాళ 80కి చేరింది. అలాగే జాతీయ స్థాయిలో ఏ క్లబ్‌కు కూడా సొంత భవనం లేదు. కానీ వరంగల్‌లో 1992లోనే సొంత భవనం నిర్మించారు. ఇక్కడి నుంచే పేదలకు సేవలను విస్తృతపరుస్తూ జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది.

***క్లబ్ ద్వారా సేవలు అనేకం***

క్లబ్ ద్వారా అనేక సేవందిస్తున్నారు. పేద మహిళల జీవనోపాధి కోసం ఉచితంగా కుట్టుశిక్షణ అందిస్తున్నారు. 25 ఏళ్ల నుంచి మూడు నెలలకు 40 మంది చొప్పున ఇప్పటివరకు నాలుగువేల మందికి ట్రైనింగ్ ఇవ్వడంతో పాటు పేదలను గుర్తించి ఉచితంగా కుట్టుమిషన్లు అందజేశారు. గృహిణులకు రోజూ ఉదయం యోగా, మ్యూజిక్, నృత్యం, పిల్లలకు సాయంత్రం కూచిపూడి, సంగీతం నేర్పిస్తున్నారు. ఏటా పదో తరగతిలో మెరిట్ సాధించిన విద్యార్థులకు సులోచన అవార్డుల పేర నగదు పారితోషికం అందిస్తున్నారు. అలాగే 7, 8, 9 తరగతుల్లో ఫస్ట్ క్లాస్ వచ్చినవారికి బాల భాస్కర్ అవార్డుల పేర నగదు పారితోషికాలు పంపిణీ చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో కనీస అవసరాలు గుర్తించి సేవలు అందించడం, వృద్ధుల ఆశ్రమాలు, ఎయిడ్స్ వ్యాధి పిల్లలు అవసరాలు గుర్తించి సహాయ, సహకారాలు అందించి అక్కున చేర్చుకుంటున్నారు. ముఖ్యంగా ఆటోనగర్‌లోని అంధుల పాఠశాలను దత్తత తీసుకుని ప్రతి నెలా ఉపాధ్యాయులకు రూ.10వేల వేతనం చెల్లించడంతో పాటు రూ.4లక్షల వ్యయంతో ఫస్ట్ ఫ్లోర్‌లో భవనం నిర్మాణం, ఇతర వసతులు కల్పించారు.

**అందరి సహకారం వల్లే.. : శోభావతి**

క్లబ్ సభ్యుల సహకారంతో పేదలకు సేవలు అందిస్తున్నాం. 48ఏళ్ల నుంచి పేద మహిళలు, వృద్ధులు, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం సహాయ, సేవా కార్యక్రమాలు చేస్తున్నాం. ఈ సంవత్సరం నుంచి పేద మెడిసిన్, ఇంజినీరింగ్ విద్యార్థుల కోసం ఏటా రూ.10వేలు అందిస్తున్నాం. తొలుత 15మందికి ఇచ్చాం.

## వివాదాల మంత్రి

### కొండా సురేఖ తీరుపై విమర్శలు

- తాజాగా బీరు పార్టీ వీడియో వైరల్
- చర్చనీయాంశంగా మంత్రి సురేఖ తీరు
- పరిపాలన, పార్టీపరంగానూ ఇదే వైఖరి



**మంత్రి కొండా సురేఖ.. ప్రస్తుతం ఏదో ఒక విషయంలో కాంట్రవర్సీ అవుతూనే ఉన్నారు. ఇప్పటికే ఆధిపత్య పోరు, గ్రూపు గొడవలతో రాజకీయంగా విమర్శలపాలవడంతో పాటు వ్యక్తిగత, ఇతర విషయాల్లోనూ తలదూర్చి తరచూ 'వివాదాస్పద మంత్రి'గా వార్తల్లో నిలుస్తున్నారు. ఇటీవలి కాలంలో ఆమె చేసిన కామెంట్లు, చేష్టలపై అంతటా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గురువారం మనుమరాలి పుట్టినరోజు వేడుక సందర్భంగా 'బీరు.. బిర్యానీ' వీడియో నెట్టింట వైరల్ అయింది. ఈ నేపథ్యంలో మినిస్టర్ హోదాలో ఉన్న వ్యక్తి ఇలా వ్యవహరిస్తుండడంపై అంతటా చర్చనీయాంశమవుతోంది.**

**- వరంగల్, నవంబర్ 22 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)**

దేవాదాయ శాఖ మంత్రి సురేఖ వరుస వివాదాలతో చర్చనీయాంశంగా మారుతున్నారు. పరిపాలన పరంగా, పార్టీలో, వ్యక్తిగతంగా ఆమె మాటలు, చేష్టలే అందుకు కారణమవుతున్నాయి. తాజాగా మనుమరాలి బర్త్ డే పార్టీ సందర్భంగా 'బిర్యానీ ఉంటే బీరు ఉంటది. బిర్యానీలు నడుస్తున్నాయి. అట్లనే సల్లవడుడు నడుస్తున్నది. ఎక్కువ డ్యాన్స్ చేసిన వాళ్లకు మందు ఎక్కువ' అంటూ మంత్రి మాట్లాడిన వీడియో కాల్ వైరల్ కాగా, సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. గురువారం రాత్రి నుంచి ఈ వీడియో అన్ని సోషల్ మీడియాల్లో బాగా చక్కర్లు కొట్టాయి. అయితే కుటుంబ, ప్రైవేట్ ఫంక్షన్ల విషయమే అయినా.. వీడియోలు వైరల్‌గా మారడంతో మంత్రిపై విమర్శలు పెరుగుతున్నాయి. ఉన్నతమైన పదవిలో ఉన్నప్పుడు దానికి తగినట్లుగా వ్యవహరించాలని, ప్రైవేట్ ఫంక్షన్ అయినా ఇలా మాట్లాడడం సరికాదని అంటున్నారు.

### పార్టీలోనూ కాంట్రవర్సీ యే..

పరిపాలన పరంగా ఉమ్మడి జిల్లాలోని మరో మంత్రి సీతక్కతో కొండా సురేఖకు మొదటి నుంచీ పొసగడం లేదు. వీరిద్దరి మధ్య ఆధిపత్య పోరు ఒకరి నియోజకవర్గంలో మరొకరు అడుగుపెట్టలేనంతగా వరకు వెళ్లింది. మంత్రులు సీతక్క, కొండా సురేఖ మధ్య విభేదాలు ఈ ఏడాది ఫిబ్రవరిలో జరిగిన మేడారం జాతర నుంచే తీవ్రమయ్యాయి. దేవాదాయ శాఖ మంత్రిగా జాతరలో కీలకంగా వ్యవహరించాల్సిన కొండా సురేఖ.. ముఖ్యమంత్రి వచ్చిన ఒక్క రోజు మాత్రమే వెళ్లి వచ్చారు. వరంగల్ నగరంలో కొత్తగా నిర్మించిన ధార్మిక భవనంలో మేడారం ఈలయ ఈవో ఆఫీసు కేటాయింపు, మేడారం జాతర పూజారుల నిరసన అంశాలు పరిపాలన పరంగా సురేఖపై విమర్శలకు కారణమయ్యాయి. దేవాదాయ మంత్రిగా కొండా సురేఖ ఆలయాల దర్శనానికి వెళ్లినప్పుడు అక్కడి నియమాల ఉల్లంఘనతో భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పార్టీ పరంగా సురేఖ వైఖరి విమర్శలకు కారణమవుతున్నది. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని అధికార పార్టీ ఎమ్మెల్యేలు కొండా సురేఖపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. తమ సెగ్మెంట్లలో పార్టీపరంగా గ్రూపులకు కారణమవుతున్నారని పలువురు ఎమ్మెల్యేలు కొండా సురేఖపై కాంగ్రెస్ అధిష్టానానికి ఫిర్యాదు చేశారు. పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, మంత్రి కొండా సురేఖ మధ్య తీవ్రస్థాయిలో విభేదాలు ఉన్నాయి. రెండు వర్గాల కార్యకర్తలు కొట్టుకోవడం దాకా వెళ్లింది.దసరా సందర్భంగా గీసుగొండ మండలం ధర్మారంలో పెట్టిన ఫ్లెక్సీలో స్థానిక ఎమ్మెల్యే ఫొటో లేకపోవడంపై మొదలైన వివాదం తీవ్రమైన విషయంగా మారింది. కొండా సురేఖ మంత్రి హోదాలో ఉండి ఆటోలో పోలీస్‌స్టేషన్‌కు వెళ్లడం, అక్కడ పోలీసులతో ఇష్టం వచ్చినట్లు మాట్లాడడం వివాదాస్పదంగా మారింది. ఈ సంఘటన తర్వాత కాంగ్రెస్ అధిష్టానం కొండా సురేఖతో మా ట్లాడింది. ఇతర సెగ్మెంట్లలో జోక్యం చేసుకోవద్దని సూచించింది. తొలుత సినీనటుడు నాగార్జున కుటుంబంపై కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు తీవ్ర వివాదానికి దారి తీశాయి. నాగార్జున దాఖలు చేసిన పరువు నష్టం కేసు విచారణ జరుగుతున్నది.

## తొలి ఉద్యమకారుడు పాగాల

- ఆయనపై కేసీఆర్‌కు ఎనలేని ప్రేమ
- జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి
- రాజవరంలో సంపత్‌రెడ్డి విగ్రహావిష్కరణ



రాజవరంలో దివంగత జడ్పీ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రాజయ్య

చిల్పూరు, నవంబర్ 22 : స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో తెలంగాణవాదానికి విత్తనాలు పడినప్పుడు మొదటగా మొలకెత్తిన వారు దివంగత జడ్పీ మాజీ చైర్మన్ పాగాల సంపత్ రెడ్డి అని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. జనగామ జిల్లా చిల్పూరు మండలంలోని రాజవరం గ్రామంలో శుక్రవారం సంపత్‌రెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్యతో కలిసి ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ నికార్సైన నాయకుడు సంపత్ రెడ్డి అని, పార్టీ కోసం నిరంతరం కష్టపడిన వ్యక్తి అని కొనియాడారు. ఉద్యమకారుడు సంపత్‌రెడ్డికి మంచి పదవి కట్ట బెట్టాలని ప్రతిసారి కేసీఆర్ గుర్తు చేసేవారు. చాలా మంది ఉద్యమకారులు పోటీ పడే సందర్భంలో అత్యంత సీనియర్ సంపత్ రెడ్డికి రావాలని ఉమ్మడి నిర్ణయం తీసుకుని జడ్పీ చైర్మన్‌ను చేశామని తెలిపారు. కేసీఆర్‌కు పాగాల సంపత్‌రెడ్డి అంటే ఎనలేని ప్రేమ, అందుకే పార్టీ జిల్లా మొదటి అధ్యక్షుడిగా సంపత్ రెడ్డిని చేసుకున్నామని పేర్కొన్నారు. ఆయన కుటుంబాన్ని ఆదుకోవాల్సిన బాధ్యత బీఆర్ఎస్ పార్టీ, మాపై ఉందన్నారు. రాష్ట్రం బాగుపడాలనే ఉద్దేశంతోనే సంపత్‌రెడ్డి ఉద్యమంలోకి వచ్చారని, ఆయన ఏదయితే ఆశించాడో అది సాధించామని, అదే స్ఫూర్తితో తెలంగాణ బాగు కోసం కేసీఆర్ అడుగు జాడల్లో నడుద్దామని పల్లా రాజేశ్వర్‌రెడ్డి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంపత్‌రెడ్డి భార్య సుజాతారెడ్డి, కుమార్తె సంజనారెడ్డి, తండ్రి జయపాల్ రెడ్డి, అన్నదమ్ములు వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, జడ్పీ మాజీ చైర్మన్ సుధీర్‌కుమార్, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ ఎడవెల్లి కృష్ణారెడ్డి, జీసీసీ మాజీ చైర్మన్ గాంధీనాయక్, రైతు బంధు మండల కోఆర్డినేటర్ జనగామ యాదగిరి, కొమురవెల్లి ఆలయ చైర్మన్ సంపత్, నియోజకవర్గ కోఆర్డినేటర్ కేశిరెడ్డి మనోజ్‌రెడ్డి, జనగామ బీఆర్ఎస్ యూత్ నాయకుడు కేశిరెడ్డి రాకేశ్‌రెడ్డి, మాలోత్ రమేశ్ నాయక్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ రంగు హరీశ్, మాజీ సర్పంచ్ ఉద్దమారి రాజ్‌కుమార్, బీఆర్ఎస్ రాజవరం, చిన్నపెండ్యాల, కొండాపూర్, నష్కల్ గ్రామ అధ్యక్షులు ఎండీ యాకూబ్ పాషా, గుంటి భీములు, గాలి ప్రవీణ్, అరూరి స్వామి, నాయకులు మామిడాల లింగారెడ్డి, ఇల్లందుల సుదర్శన్, గజ్జెల దామోదర్, మారెపల్లి శ్యామ్‌కుమార్‌రెడ్డి, మారెపల్లి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు విస్తరణకు బ్రేక్



పట్టణంలోని జయశంకర్ సెంటర్

- రూ. 9 కోట్లతో పనులు ప్రారంభించిన బీఆర్ఎస్
- ప్రభుత్వం మారడంతో ముందుకు సాగని వైనం
- పది నెలలుగా రోడ్డు విస్తరణ, సెంట్రల్ లైటింగ్ పనులు ఎక్కడివక్కడే
- ఆగిన జంక్షన్ల అభివృద్ధి.. ట్రాఫిక్ సమస్యతో జనం సతమతం

**జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో రోడ్డు విస్తరణ పనులకు బ్రేక్ పడింది. రోడ్డు వెడల్పు, సెంట్రల్ లైటింగ్‌కు బీఆర్ఎస్ ప్రభుత్వం రూ. 10 కోట్లు మంజూరు చేసి పనులు ప్రారంభించగా ప్రభుత్వం మారగానే అవి ఆగిపోయాయి. కాంగ్రెస్ సర్కారు కాంట్రాక్టర్లను సైతం మార్చినా పది నెలలుగా పనులకు అతీగతీ లేదు. అలాగే పట్టణంలో మూడు జంక్షన్ల అభివృద్ధికి బీఆర్ఎస్ ప్రభుత్వం నిధులు మంజూరు ఇచ్చినా పనులు ప్రారంభం కాలేదు. దీంతో ట్రాఫిక్ సమస్య తలెత్తి జనం సతమతమవుతున్నా అధికారుల్లో చలనం లేదు. వెంటనే పనులు పూర్తి చేసి తమ ఇబ్బందులు తీర్చాలని స్థానికులు కోరుతున్నారు.**

**- జయశంకర్ భూపాలపల్లి, నవంబర్ 22 (నమస్తే తెలంగాణ)**

భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలో అంబేద్కర్ సెంటర్ నుంచి ఓపెన్‌కాస్టు జంక్షన్ వరకు రోడ్డు విస్తరణ, సెంట్రల్ లైటింగ్, డ్రైనేజీ నిర్మాణానికి అప్పటి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ప్రత్యేక చొరవ చూపి నిధులు మంజూరు చేయించారు. అప్పటికే జంగేడు మీదుగా సెగ్గంపల్లి, కాశీంపల్లి వరకు రోడ్డు విస్తరణ, సెంట్రల్ లైటింగ్ పూర్తి చేశారు. అనంతరం చేపట్టిన అంబేద్కర్ సెంటర్ నుంచి రామాలయం మీదుగా ఓసీ జంక్షన్ వరకు పనులు బీఆర్ఎస్ ప్రభుత్వం మారడంతో నిలిచిపోయాయి. సుమారు 1700 మీటర్ల పొడవుతో రూ.10 కోట్లతో చేపట్టిన పనులకు అధికారులు బ్రేక్ వేశారు. పాత కాంట్రాక్టర్లను తప్పించి కొత్తవారికి అప్పగించారు. అయినా పది నెలలుగా మోక్షం లభించలేదు. అయితే జనం నుంచి వస్తున్న ఒత్తిడి మేరకు అధికారులు ఇప్పుడిప్పుడే డ్రైనేజీ పనుల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు.

***జంక్షన్ల అభివృద్ధి ఏదీ?***

జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉన్న సెంటర్లను గుర్తించిన గత ప్రభుత్వం అంబేద్కర్, జయశంకర్, గణేశ్ సెంటర్ల అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ రూపొందించి ఒక్కో సెంటర్‌కు మొదటి విడతగా రూ. 10 లక్షల చొప్పున కేటాయించింది. ఈక్రమంలో అంబేద్కర్ సెంటర్ నుంచి ఓసీ జంక్షన్ వరకు రోడ్డు విస్తరణ పనులు చేపట్టారు. అనంతరం సెంట్రల్ లైటింగ్‌తో పాటు జంక్షన్ అభివృద్ధి చేపట్టాలని ప్లాన్ చేశారు. అయితే రోడ్డు విస్తరణ పనులకు బ్రేక్ పడడంతో జంక్షన్ల అభివృద్ధి ఆగింది. పది నెలలుగా పనులు పెండింగ్‌లో ఉండడంతో జంక్షన్ల అభివృద్ధి అటకెక్కింది. దీంతో ముఖ్యంగా అంబేద్కర్ సెంటర్‌లో ట్రాఫిక్ సమస్య తీవ్రతరమవుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారు.

***డ్రైనేజీ పనులు ప్రారంభించాం***

***- మానస, ఏఈ, భూపాలపల్లి***

అనివార్య కారణాల వల్ల రోడ్డు విస్తరణ పనులకు బ్రేక్ పడింది. మరో కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించగా ప్రస్తుతం డ్రైనేజీ పనులు ప్రారంభించాం. అనంతరం రోడ్డు విస్తరణ, సెంట్రల్ లైటింగ్ పనులు కొనసాగిస్తాం. పనుల్లో జాప్యం జరిగిన మాట వాస్తవమే. ఇప్పుడు పనులు స్పీడప్ చేస్తాం.

## సమాధులూ కడగాల్సిందే!



ములుగులో మాజీ సర్పంచ్ భర్త సోదరుడి సమాధిని శుభ్రం చేస్తున్న జీపీ కార్మికుడు


### జీపీ సిబ్బందితో మాజీ సర్పంచ్ వెట్టిచాకిరీ

- పదవీ కాలం పూర్తయినా ఆగని ఇంటి పనులు
- సమాధులు శుభ్రం చేయించుకున్న వైనం
- చోద్యంచూస్తున్న అధికారులు

ములుగు, నవంబర్22(నమస్తేతెలంగాణ): ములుగు జిల్లా కేంద్రంలోని జీపీ సిబ్బందితో మాజీ సర్పంచ్ పాలేరు పనులు చేయించుకుంటున్నారు. మాజీ సర్పం చ్ భర్త సోదరుడు గతేడాది మృతి చెందగా శుక్రవారం అతని సమాధిని జీపీ కార్మికుడితో శుభ్రం చేయించడమే ఇందుకు నిదర్శనం. 2019లో ము లుగు సర్పంచ్‌గా ఎన్నికైన నాటి నుంచి జీపీ సిబ్బందిని వ్యవసాయ పనులతో పాటు పశువుల పోషణ వంటి ఇతర ఇంటి పనులు చేయించుకుంటున్నట్లు తెలిసింది. ఈ ఏడాది సర్పంచ్ పదవీ కాలం పూర్తయి ఇన్‌చార్జి అధికారుల పాలన కొనసాగుతున్నప్పటికీ గతంలో లాగానే జీపీ సిబ్బందిని తన సొంత పనులకు వాడుకుంటున్నాడు. కొందరు జవాన్లు అతడి ఇంట్లో పారిశుధ్య కార్మికులను పనులకు పెట్టించి రోజు వారీ జీపీ విధుల్లో పనులు చేసినట్లుగా నమోదు చేస్తూ కార్యదర్శిని తప్పుదోవ పట్టిస్తున్నారు. మాజీ సర్పంచ్ ఇంట్లో కొందరు జీపీ కార్మికులు రోజువారీగా పనులు చేస్తుండగా ములుగులో పారిశుధ్య పనులు చేపట్టే సిబ్బందిపై అదనంగా పనిభారం పడుతోంది. దీంతో పూర్తిస్థాయిలో పలు కాలనీల్లో పారిశుధ్య పేరుకుపోతుంది. ఇదేమని ప్రశ్నించిన కొందరు జీపీ సిబ్బందిపై జవాన్లు ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు కార్మికులు బహిరంగంగా చర్చించిన సందర్భాలు ఉన్నాయి. అయితే జవాన్లతో పాటు జీపీ కార్మికుల్లో కొందరు మాజీ సర్పంచ్ పనిలో పెట్టించిన వారు కావడంతో విషయాలు బయటకు రానివ్వడం లేదు. ఈ విషయమై డీపీవోను వివరణ కోరగా ఈ విషయం తన దృష్టికి వచ్చిందని, మరోసారి పునరావృతం కాకుండా చర్యలు చేపడుతామన్నారు. అదేవిధంగా జీపీ కార్యదర్శిని వివరణ కోరగా కొందరు సిబ్బంది అప్పుడప్పుడు విధులకు డుమ్మా కొడుతున్నారని, ఇందులో భాగంగానే శుక్రవారం కొందరు కార్మికులు గైర్హాజరై మాజీ సర్పంచ్ ఇంట్లో పనిచేసినట్లు తెలిసిందని, వారిపై చర్యలు తీసుకుంటామని వివరించారు.

## చేపలు ఖాళీ.. కొంగల ఆకలి!





చెరువులో చిన్న, చిన్న చేపలు దొరక్క విలవిలలాడుతున్న కొంగలు



### భద్రకాళీ చెరువులో ఆహారం దొరకక విలవిల



భద్రకాళీ చెరువులో వలకు చిక్కిన చేపలను బయటకు తీస్తున్న మత్స్యకారులు



రాళ్లు, బురదతో దర్శనమిస్తున్న భద్రకాళీ చెరువు

***ఇక్కడ చెరువులో గుంపులు గుంపులుగా చేరి చేపల కోసం కొంగలు పడుతున్న పాట్లు అన్నీఇన్నీ కావు. సాధారణంగా ఎప్పుడూ ఇక్కడ తిరుగాడే కొంగలతో పాటు ఈ సీజన్‌లో మాత్రమే అరుదుగా కనిపించే సైబీరియన్ వంటి సుదూర ప్రాంత పక్షులు జలవనరులు ఎక్కువున్న ప్రాంతాలను వెతుక్కుంటూ వస్తాయి. ఈ క్రమంలో నిత్యం నీటితో కళ కళ లాడే వరంగల్ భద్రకాళీ చెరువుకు రావడంతో ఇప్పుడు మొత్తం ఖాళీ అయి.. రాళ్లు, బురద మట్టి తేలింది. నీటి తరలింపు మొదలైనప్పటి నుంచే మత్స్యకారులు వలలు వేసి ఉన్న చేపలన్నీ పట్టేయడంతో వట్టిపోయింది. ఇదే సమయంలో అక్కడికి వచ్చిన ఈ కొంగలు.. చేపలు దొరకక ఆకలికి విలవిల్లాడాయి. బురదలో అటూ, ఇటూ వెతుకుతూ ఎక్కడైనా చేపలు కనిపించకపోతాయా.. అని ఆశగా ఎదురుచూస్తున్న అరుదైన దృశ్యాలు 'నమస్తే తెలంగాణ' కెమెరాకు చిక్కాయి.***

***- వరంగల్ ఫొటోగ్రాఫర్, నవంబర్ 22***



వరంగల్ భద్రకాళీ చెరువులో చేపల కోసం ఎదురుచూస్తున్న కొంగలు

## మన్యంలో అలజడి

- ఇన్‌ఫార్మర్ల నెపంతో మావోయిస్టుల దుశ్చర్య
- పెనుగోలులో పంచాయతీ కార్యదర్శి, అతడి సోదరుడి హత్య
- కార్యదర్శి హత్యను నిరసిస్తూ అధికారులు, కార్యదర్శులు, గిరిజన సంఘాల ర్యాలీ
- న్యాయం చేయాలంటూ మృతదేహాలతో బంధువుల రాస్తారోకో



రోదిస్తున్న రమేశ్ భార్య రాంబాయి, బంధువులు



రమేశ్(ఫైల్)



ఉయిక అర్జున్(ఫైల్)

వాజేడు, నవంబర్22 : మన్యంలో అలజడి నెలకొంది. గిరిజనుల హత్యతో ఏజెన్సీ గ్రామాలు ఉలిక్కిపడ్డాయి. ములుగు జిల్లా వాజేడు పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఉన్న పెనుగోలు కాలనీ(బాలలక్ష్మీపురం) గ్రామంలో గురువారం రాత్రి మావోయిస్టులు ఇన్‌ఫార్మర్ల నెపంతో పంచాయతీ కార్యదర్శితో పాటు అతడి వరుస సోదరుడిని హత్య చేశారు. మృతుల కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇంట్లో నిద్రిస్తు న్న కార్యదర్శి రమేశ్‌ను నల్లరంగు దుస్తులు ధరించిన ముగ్గురు గొడ్డళ్లతో నరికిచంపారు. భార్య ప్రాధేయపడినా వినకుండా నరికి అక్కడి నుంచి వెళ్లిపోయారు. కొన ఊపిరితో ఉన్న రమేశ్‌ను బంధువుల సహాయంతో 108 వాహనంలో ఏటూరునాగారం వైద్యశాలకు తరలించగా మృతి చెందాడు. గొర్ల కాపరి ఉయిక అర్జున్ ఇంటికి ముగ్గురు వ్యక్తులు వచ్చి బయటకు తీసుకువెళ్లి మాట్లాడి పంపిస్తామని అతని భార్యకి చెప్పి బయటకు రాగానే గొడ్డళ్లతో నరికి హతమార్చారు. పోలీసులకు ఇన్‌ఫార్మర్లుగా వ్యవహరిస్తున్నందున వారిని హతమార్చినట్లు భారత కమ్యూనిస్ట్ పార్టీ(మావోయిస్టు) వెంకటాపురం-వాజేడు ఏరి యా కమిటీ కార్యదర్శి శాంత పేరిట ఘటనా స్థలంలో లేఖలు వదిలివెళ్లారు. మృతుల కుటుంబసభ్యులు రోదిస్తున్న తీరు పలువురిని కలిచివేసింది. రమేశ్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉండగా, అర్జున్‌కు ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు. ఏటూరునాగారం వైద్యశాల వద్ద మృతదేహాలను పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు. ఈ హత్యలను ఖండిస్తూ జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన కార్యదర్శులు, ఎంపీవోలు, స్థానిక అధికారులు, గిరిజన సంఘాల నాయకులు మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు.

***మృతదేహాలతో రాస్తారోకో***

ఇద్దరి కుటుంబ సభ్యులు, బంధువులు, గిరిజనసంఘాల నేతలు కలసి వాజేడు జగన్నాథపురం వెళ్లే ప్రధాన రహదారిపై మృతదేహాలతో బైఠాయించారు. వెంకటాపురం సీఐ బండారు కుమార్, ఎస్సై తిరుపతిరావు, వాజేడు ఎస్సై రుద్రరాపు హరీశ్ అక్కడికి చేరుకొని పోలీసు శాఖతోపాటు ప్రభుత్వం తరపున ఆదుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

***ఇప్పటి మావోయిస్టుల ఘటనలు***

1975లో చంద్రుపట్ల గ్రామానికి చెందిన వ్యాపారి దర్శి వెంకటేశ్వరరావును అప్పటి పీపుల్స్‌వార్ అగ్రనేత కొండపల్లి సీతారామయ్య నేతృత్వంలో హత్య చేశారు. 1987లో వాజేడులో బుద్దరాజు సీతాపతిరాజును కాల్చిచంపారు. 1991లో వాజేడు పోలీస్ స్టేషన్‌ను బాంబులతో బ్లాస్టింగ్ చేసి ఆయుధాలు ఎత్తుకెళ్లారు. ఆ తర్వాత అరుణాచలపురం గ్రామంలో రాజు, మొరుమురు గ్రామానికి చెందిన బోదెబోయిన సుందర్‌రావును చంపారు. 2007లో ధర్మవరం గ్రామంలో ఆర్ఎంపీ వైద్యుడు బండారు శ్రీనివాస్‌ను, 2008లో వాజేడుకు చెందిన రైతు దంతులూరి తిరుపతిరాజు(చంటిబాబురాజు)ను పొలంలో పట్టపగలే ట్రాక్టర్‌పైనే కాల్చి చంపారు. 2011లో వీఆర్‌ఏ ఆలం కృష్ణయ్యను గొడళ్లతో నరికి హత్య చేశారు. 2016లో టేకులగూడెం గ్రామ శివారులో 163 జాతీయ రహదారి నిర్మాణ పనులకు వినియోగిస్తున్న వాహనాలను దగ్ధం చేశారు. మళ్లీ ఇప్పుడు ఇద్దరిని హత్య చేసి తమ ఉనికిని చాటుకున్నారు.

***అమాయకులకు ఇన్‌ఫార్మర్ ముద్ర: ఎస్పీ శబరీష్***

ములుగురూరల్: మావోయిస్టులు అయాయకులైన ఇద్దరు ఆదివాసీ యువకులపై ఇన్‌ఫార్మర్ ముద్రవేసి హత్య చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఎస్పీ డాక్టర్ పీ శబరీష్ ఒక ప్రకటనలో తెలిపారు. అటవీ గ్రామానికి చెందిన విద్యా వంతుడు ఉయిక రమేశ్ మావోయిస్టు పార్టీకి సహకరించడం లేదనే కారణంతో పాశవికంగా హత్య చేశారని అన్నారు. ఇలాంటి దుశ్చర్యలను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదన్నారు. పౌర హక్కుల సంఘాల నేతలు ఈ ఘటనపై స్పందించాలన్నారు.



ములుగు జిల్లా వాజేడులో ర్యాలీ తీస్తున్న పంచాయతీ కార్యదర్శులు, మండలపరిషత్ ఉద్యోగులు, గిరిజన సంఘం నాయకులు